మీరు లేరు.. అంతా ఆగమాగం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎదుట కంట తడిపెట్టి గోడువెల్లబోసుకున్న రైతులు

కన్నీళ్లు తుడిచి ధైర్యం చెప్పేందుకే వచ్చా ◆ పొలంబాటలో రైతులకు కేసీఆర్ భరోసా

ధరావత్‌తండాలో ఎండిన పంటల పరిశీలన ◆ కొడుకు పెండ్లికి డబ్బుల్లేవని సత్తెమ్మ ఆవేదన

రూ.5 లక్షల సాయం ప్రకటించిన కేసీఆర్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు దండంపెట్టి తన గోడును వెల్లబోసుకుంటున్న జనగామ జిల్లా ధరావత్‌తండాకు చెందిన అంగోత్ సత్తెమ్మ

వరంగల్, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంచిగుండె సారు. మీరు లేరు ఇప్పుడు అంతా ఆగమైపోతంది సారు. తొమ్మిదేండ్లు చెరువులు, కుంటల్లో నీళ్లుండేది. బోర్లల్ల మంచిగ నీళ్లు ఉండేది. అవన్నీ నీతోనే పోయినయి. ఇప్పుడు పచ్చులోలిగే మారినం. పంటలన్నీ ఎండిపోయినయి. మళ్లీ కరువొచ్చింది. మేమెట్లా బతకాలి. అప్పులు చేసి తింటున్నాం' అంటూ రైతులు అంగోత్ సత్తెమ్మ, బానోత్ హేమానాయక్, పులుసోత్ ధన్‌సింగ్, గుగులోత్ లక్ష్మణ్, గుగులోత్ రాజమ్మ, కునుసోత్ జ్యోతి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. ఎండిన పంటల పరిశీలన కోసం కేసీఆర్ ఆదివారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాకు వచ్చారు. గిరిజన రైతుల పంటలను పరిశీలించారు. అంగోత్ సత్తెమ్మకు చెందిన ఎం డిన వరి చేనులో దాదాపు అరగంట ఉన్నారు. అక్కడికి వచ్చిన రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అంగోత్ సత్తమ్మ వరి పొలంలో రైతులతో కేసీఆర్ ముచ్చట ఇలా సాగింది. కేసీఆర్ వెంట ఎంపీ, మానుకోట బీఆర్ఎస్ అభ్య ర్థి మాలోత్ కవిత, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జీ జగదీశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, వీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్యానాయక్, బానోత్ శంకర్ నాయక్, చల్లా ధర్మారెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, గ్యాదరి బాలమల్లు, జడ్పీ చైర్మన్ శ్రీరాం సుధీర్‌కుమార్, కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంగోత్ సత్తెమ్మ : మీరు లేరు అంతా ఆగమైపోతాంది సారు. ఎనిమిది ఎకరాల్లో వేసిన వరి పంటకు నీళ్లు లేక కండ్ల ముందే ఎండింది. నెల కిందటే రెండు ఎకరాలు ఎండింది. పసులు మేసినయి. ఇప్పుడు ఆరు ఎకరాలు ఎండింది. పంట కాపాడుకునేందుకు రూ.1.82 లక్షలు పెట్టి నాలుగు బోర్లు వేసినా లాభం లేదు. పెట్టుబడికి తెచ్చిన రూ.3 లక్షల అప్పు మీద పడ్డది. నాలుగో తారీఖున నా కొడుకు రాజేందర్ పెండ్లి పెట్టుకున్నం. బిడ్డ పెండ్లి అప్పుడు అప్పు అయింది. ఈసారి పంట పండితే సంబురంగా లగ్గం చేయాలనుకున్న. ఇప్పుడు చేతిలో చిల్లి గవ్వలేదు సారూ.

(పెండ్లి కార్డు కేసీఆర్ చేతిలో పెట్టి కాళ్ల మీద పడి వెక్కివెక్కి ఏడ్చింది)

కేసీఆర్: ఏడ్వద్దమ్మా. ధైర్యం చెడొద్దు. నేను వచ్చిందే మీ కోసం. మీకు అండగా నిలుస్తా. ఏం కాదు. మళ్లీ వచ్చేది మనమే. అందరం కలిసి పోరాటం చేద్దాం. నీకు రూ.5 లక్షలు ఇస్తా. కొడుకు పెండ్లి ధూంధాంగా చేసుకో.

(మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పిలిచి.. ఇప్పుడు నేను ప్రకటించిన సాయం రేపే వీళ్లకు అందాలి. కొడుకు పేరు మీద రూ.2.50 లక్షలు, బిడ్డ పేరు మీద రూ.2.50 లక్షల చెక్కు ఇవ్వాలని చెప్పారు)

కునుసోత్ జ్యోతి: కాలువల్లో నీళ్లు రాలే. బోర్లు ఎండిపోయినయ్. కరెంటు సక్కగ వస్త లేదు. ఇప్పటికే నాలుగు సార్లు బోరు మోటర్ కాలిపోయింది. మీరు ఉన్నపుడు మంచిగ ఉండే సారు. ఇప్పుడు మళ్లీ ఎనుకటి కాలం వచ్చింది. పొయ్యిల పడ్డట్టు అయింది సారు మా పని. పంట పండితేనే బతుకుదెరువు. లేకుంటే మళ్లీ బతుకబోవుడే అయితది. ఏం చేయాలి సారు.

కేసీఆర్ : ఏం కాదమ్మా. మళ్లీ మనమే వస్తం. అందరం కలిసి పోరాటం చేద్దాం. మీకు తోడుగా నేనుంటా. మీ అందరి కష్టాలు చూసేందుకే పొలంబాట పట్టిన. మీ నష్టాన్ని చూస్తున్నా. బాధలు వింటున్న. ఏం చేయాలో అది చేద్దాం. అంతేగాని ధైర్యం చెడొద్దు. ఇలాంటి కష్ట సమయంలోనే నిలబడి ఉండాలి. అధికారులు వస్తారు. మీరు నష్టపోయినదంతా చూపించి రాయించండి.

గుగులోత్ రాజమ్మ: మంచినీళ్లు సుత సరిగ్గా ఇడుస్తలేరు సారు. తొమ్మిదేండ్లు ఇండ్లకు, పొలాలకు నీళ్లు మంచిగ ఇడిసిండ్లు. ఇప్పుడు మళ్లీ నీళ్ల బాధ మొదలైంది. పంటలు ఎండుతున్నయ్. అప్పులు పెరుగుతున్నాయ్ సారు. మా కష్టాలు ఎవరూ తీర్చాలి? ఇట్ల అయితే ఎట్ల సారు. మాకు దిక్కెవరు?

పులుసోత్ ధరంసింగ్: మీరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంచిగుండె సారు. ఇప్పుడు అంతా ఆగమైపోయింది. తొమ్మిదేండ్లు చెరువులు, కుంటల్లో నీళ్లుండేది. కాలువల్లో నీళ్లు ఇడిసేది. బోర్లల్ల మంచిగా నీళ్లు ఉండేది. అవన్నీ నీతోనే పోయినయి. ఇప్పుడు పచ్చులోలిగే మారినం. తొమ్మిదేండ్ల తర్వాత పంటలన్నీ ఎండిపోయాయి. రూ.2 లక్షల రుణమాఫీ లేదు. రైతుబంధు పూర్తిగా పడుత లేదు. అప్పులు చేసి తింటున్నం సారూ.

కేసీఆర్: మంచి నీళ్లు వస్తలేవని అధికారులకు చెప్పలేదా? ఏమంటున్నారు? ఎందుకు వస్తలేవో అడగండి. మీ కోసం దయాకర్‌రావు అడుగుతడు. ఆయన మీకు తోడుగా నీడగా ఉంటడు. అన్ని సమస్యలపై కలిసి నిలదీద్దాం.

బానోత్ హేమానాయక్: తొమ్మిదేండ్లు కాలువలతో చెరువు, కుంట నిండేది. బోర్లు, బావుల్లో నీళ్లు మస్తుగా ఉండేది. సంబురంగా ఎవుసం చేసుకున్నం సారు. కాంగ్రెస్ వచ్చింది కష్టాలు మొదలైనయి. భూమిలో నీళ్లు లోపటికి పోతున్నయి. పంటలు ఎండుతున్నయి. తాగేటందుకు కూడా నీళ్లు లేవు. మీరు ఉన్నప్పుడు ఏ బాధలు లేకుండే. మూడు నెలల్లోనే అంతా ఆగమైనం సారు.

కేసీఆర్ : మీరు పడుతున్న కష్టాలు పంటలు ఎండి జరిగిన నష్టాన్ని స్వయంగా చూసేందుకే మీ వద్దకు వచ్చిన. ఎండిన పంటలు అన్ని చూసిన తర్వాత ఏం చేయాలో, ఎలా చేయాలో నిర్ణయం తీసుకుంటం. ఏం కాదు. మీరు మాత్రం ధైర్యంగా ఉండాలి. రైతుల కోసం బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఏమైనా చేస్తాడు. మీ కష్టాన్ని దగ్గరుండి చూస్తున్న. అధైర్యపడొద్దు.

● పొట్టకొచ్చిన వరి ఎండుతున్నా నీళ్లివ్వరా?

ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌తోపాటు నేలకొండపల్లి మండలంలో ఎండిపోయిన పంటలను బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ఆధ్వర్యంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, చంద్రావతి పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు.
– ఖమ్మం,నమస్తే తెలంగాణ ప్రతినిధి

● నీళ్ల కోసం రోడ్డెక్కిన రైతాంగం

కరీంనగర్ జిల్లా కొండన్నపల్లి వరదకాలువ వద్ద జగిత్యాల-కరీంనగర్ హైవేపై ఆదివారం రైతులు ధర్నాకు దిగారు. వీరికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం ప్రకటించారు. వరద కాలువకు నీరు ఇచ్చి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. దిగివచ్చిన సర్కారు సాయంత్రం గాయత్రీ పంప్‌హౌస్ నుంచి వరద కాలువకు నీటిని వదిలింది. – గంగాధర

● ఎస్సారెస్పీ కాల్వకు నీళ్లివ్వాలని రాస్తారోకో

ఎస్సారెస్పీ కాల్వకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామ శివారులోని కరీంనగర్-రాయపట్నం రహదారిపై రైతులు ఆదివారం రాస్తారోకో చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు నీటి పారుదల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడించారు. ఏప్రిల్ 2 వరకు కాల్వకు నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. –ధర్మారం

● మండుటెండలో పొలంలో నిరసన

కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే సాగునీటికి కటకట ఏర్పడి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మండిపడ్డారు. ఆదివారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణరావుపేట శివారులో సాగునీరందక ఎండిపోయిన వరి పొలాలను ఆమె పరిశీలించి రైతులను ఓదార్చారు. కథలాపూర్ శివారులో ఎస్సారెస్పీ వరదకాలువలో అడుగంటిన నీటిని పరిశీలించారు. – కథలాపూర్

ఏసిన ఐదెకరాలు ఎండిపోయింది

- మీ పాలనలో నీళ్లొస్తే ఈయేడు నీళ్లివ్వలేదు
- ముందుగా చెప్తే పంటలే వేసేటోళ్లం కాదు
- కేసీఆర్‌తో యర్కారం రైతు సరోజనమ్మ

సూర్యాపేట, మార్చి 31 (నమస్తే తెలంగాణ): 'మీ పాలనలో వరుసగా కాళేశ్వరం నీళ్లు వస్తే పంటలు పండాయి. ఏకంగా పొలం వద్దే ఇల్లు కట్టుకొని సంతోషంగా సాగు చేసుకుంటున్నాం. మా ఖర్మకాలి కాంగ్రెస్ అధికారంలోకి రాగా ఈ సారి ఏసిన ఐదెకరాలు ఎండిపోయినై. వరి ఈనినంక చేతికి వస్తదనుకుంటున్న సమయంలో నీళ్లు రాక ఎండిపోయింది. ఎకరానికి పెట్టుబడిగా రూ.50 వేలు పెట్టినం. రెండు నెలల్లో 12 బోర్లు వేసినా ఫలితం రాలేదు. మా ఒక్క పొలమే కాదు యర్కారం గడ్డ సగం ఊడ్చుకుపోయింది. ఏం లేదు సార్. ముందుగానే నీళ్లు ఇవ్వమంటే పంటలు వేయం కదా. ఇస్తామని చెప్పి కాల్వల్ల కొన్ని నీళ్లు వదిలితే చివరి వరకు నీళ్లు వస్తాయనుకుని పంటలు వేసి అప్పుల పాలయ్యాం' అని సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన మహిళా రైతు సరోజనమ్మ కేసీఆర్‌కు ఆవేదనతో విన్నవించుకున్నది. 'లొల్లిబెడితే కాదు. ప్రభుత్వం మెడలు వంచుదాం. కొట్లాడుదాం. మీకు నష్ట పరిహారం వచ్చేదాకా కొట్లాడుదాం. మీరు ధైర్యం కోల్పోకురి. మీకు అండగా ఉంటా. అందరం కలిసి కొట్లాడుదాం. పంట నష్ట పరిహారాన్ని సాధిద్దాం' అని కేసీఆర్ మహిళా రైతుకు భరోసా కల్పించారు.

పదెకరాలు నాటేస్తే ఎనిమిది ఎకరాలు ఎండిపోయింది

సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తుంగతుర్తి మండలంలోని వెలుగుపల్లి వద్ద లకావత్ సురేశ్ అనే రైతును పలుకరించారు. సదరు రైతు వెళ్లబోసుకున్న గోడుకు కేసీఆర్ చలించిపోయారు. 'నాకు నాలుగు ఎకరాలుంటే పక్కనే మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని మొత్తం పదెకరాలు సాగు చేసిన. ప్రస్తుతం ఎనిమిది ఎకరాలు ఎండిపోయి రెండెకరాలు మాత్రమే మిగిలింది దాదాపు రూ.4 లక్షలకు పైనే ఖర్చు చేస్తే రూ.20 వేల పంట కూడా వచ్చేలా లేదు. మీరున్నన్ని రోజులు వచ్చిన నీళ్లు ఇయ్యాల ఎందుకు వస్తలేవు సార్ ? ఇయ్యాల మీరు రాగానే కాలువల్ల నీళ్లు వదిలిండ్రు. పంటలు ఎండిపోయినంక నీళ్లు వదిలితే ఫాయిదా ఏంముంటది' అని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. రైతు ఆవేదనకు చలించిన కేసీఆర్ అధైర్య పడొద్దంటూ భరోసా ఇచ్చారు. 'ఏ రైతు కూడా ఆవేదన చెందొద్దు. మీకు అండగా నేను, బీఆర్ఎస్ పార్టీ ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ఎండిపోయిన పంటలకు నష్ట పరిహారం తెచ్చుకుందాం.. తెచ్చి తీరుతాం' అని రైతుకు కేసీఆర్ ధైర్యం చెప్పారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో..5న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఏప్రిల్ 5వ తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఎండిన పంటలను పరిశీలించి, రైతుల కష్టాలను తెలుసుకోనున్నారు.

అంతర్గత వైరింగ్ సమస్యే కారణం

- సీఎం పర్యటనలో పవర్‌కట్‌పై విద్యుత్తు శాఖ వివరణ
- సూర్యాపేటలో కేసీఆర్, మెదక్‌లో హరీశ్‌రావు మాట్లాడుతుండగా అంతరాయం

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇంటికి వెళ్లినప్పుడు కరెంటు పోవడంపై విద్యుత్తు శాఖ స్పందించింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ నేత వై సతీశ్‌రెడ్డి ఎక్స్‌లో చేసిన పోస్ట్‌కు టీఎస్ఎస్పీడీసీఎల్ వివరణ ఇచ్చింది. సీఎం పర్యటన సమయంలో విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తలేదని పేర్కొన్నది. ఆ ఇంట్లో అదనంగా లైట్లు బిగించారని, ఇందు కోసం వేసిన తాత్కాలిక వైరింగ్‌లో లోపం కారణంగానే కరెంటు పోయిందని తెలిపింది. సతీశ్‌రెడ్డి పోస్ట్ చేసిన ఫొటోల్లోనే ఇంట్లోని, వీధిలోని లైట్లు వెలుగుతున్నాయని గుర్తుచేసింది. రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక గరిష్ఠ విద్యుత్తు వినియోగం ఉన్నప్పటికీ నిరంతరాయంగా విద్యుత్తును అందించేందుకు తమ సిబ్బంది నిరంతరం కృషి చేస్తున్నారని వెల్లడించింది. అయితే, ఈ వివరణపై సోషల్ మీడియాలో సెటైర్లు కనిపించాయి. 'ఇంట్లో లైట్ కనిపిస్తున్నదని కరెంట్ ఉన్నది అంటావ్.. అది ఇన్వర్టర్ లేదా జనరేటర్ కాదు అంటావ్. అంతేగా.. అంతేగా?' అంటూ ఒక నెటిజన్ కామెంట్ చేశారు.

కేసీఆర్ మాట్లాడుతుండగా..

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న సమయంలో సైతం కొన్ని సెకండ్లపాటు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగింది. దీనిపై టీఎస్ఎస్పీడీసీఎల్ వివరణ ఇచ్చింది. సూర్యాపేటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రైవేట్ జనరేటర్ల ద్వారా విద్యుతును సరఫరా చేసుకున్నారని తెలిపింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎక్కడా కరెంటు పోలేదని స్పష్టం చేసింది. మరోవైపు మాజీ మంత్రి హరీశ్‌రావు మెదక్ జిల్లా నిజాంపేటలో పర్యటిస్తున్న సమయంలో కొద్దిసేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలిగింది.

బోనస్ ఇచ్చే వరకు వెంటాడుతం

- యాసంగి ధాన్యానికి అదనంగా రూ. 500 ఇవ్వాలి
- 2న కలెక్టర్లకు వినతిపత్రాలు
- 6న నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు
- బీఆర్ఎస్ అధినేత ప్రకటన

రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి వరి కోతలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలోని సబ్ మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది. అయితే ప్రభుత్వం కొనుగోళ్లలో జాప్యం చేయడంతో రైతులు ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేపట్టకపోతే ధాన్యం దళారుల పాలుకాక తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): రైతులకు ఇచ్చిన హామీ మేరకు యాసంగి ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే, ఇచ్చేంత వరకు వెంటాడుతామని హెచ్చరించారు. ఆదివారం పలు జిల్లాల్లో ఎండిన పంటలను పరిశీలించిన అనంతరం కేసీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ''పోయిన పంట పోగా ఎంతో కొంత పంట వస్తది కాబట్టి ఆ పంటకు ఎట్టి పరిస్థితుల్లో అయినా సరే రూ. 500 బోనస్ కచ్చితంగా ఇచ్చి తీరాల్సిందే. లేదంటే వెంటాడుతాం. అన్ని పంటలకు బోనస్ ఇస్తమని మ్యానిఫెస్టోలోనే హామీ ఇచ్చారు. ఇప్పుడు ధాన్యం వస్తుంది కాబట్టి రూ. 500 బోనస్ ఇవ్వాల్సిందే. బోనస్ ఇచ్చేంత వరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఇందుకోసం అన్ని జిల్లాల బీఆర్ఎస్ నాయకులకు మనవి చేస్తున్నా, ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న రైతుల పక్షాన జిల్లాల కలెక్టర్లకు మెమొరాండం అందించాలి. అదే రోజున బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హైదరాబాద్‌లో ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందిస్తాం. పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఒక రోజు దీక్షలు చేయాలి. ఈ తోలు మందం ప్రభుత్వానికి నిరహార దీక్ష అవసరం లేదు. కడుపునిండా తినే దీక్ష చేయండి చాలు. ఈ ప్రభుత్వం కోసం మనం ఊపవాసం ఉండాల్సిన అవసరం లేదు. ఆ తర్వాత కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వాన్ని నిలదీయాలి.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

బీఆర్ఎస్ ప్రభుత్వంలో 7600కు పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. కానీ ఇప్పుడు ఎన్ని కేంద్రాలు పెడతారో ఇప్పటికీ చెప్పడం లేదు. రేపటి నుంచే కొనుగోలు అని చెప్పారు. ప్రజలను ఏప్రిల్ ఫూల్ చేద్దామని అనుకుంటున్నారా?. గతంలో కన్నా ఒక్క కేంద్రం తక్కువగా పెట్టిన ఊరుకోం'' అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేసీఆర్ హెచ్చరించారు.

చేతగాని సర్కారిది

› మొదటిపేజీ తరువాయి...

మాట్లాడారు. వాళ్ల కష్టాలను విన్నారు. కన్నీళ్లను తుడిచారు. కరువుకు కారణాలను వివరించారు. తర్వాత సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'గోదావరిలో డ్యాములున్నాయి. ఎత్తిపోసేందుకు మోటర్లున్నాయి. నిల్వ చేసేందుకు జలాశయాలున్నాయి. కరెంటు సరఫరాకు వ్యవస్థలున్నాయి. నింపుకొనేందుకు చెరువులున్నాయి. ఇంటింటికీ నల్లాలున్నాయి. కట్టిన ఇల్లు, పెట్టిన పొయ్యిలాంటి అనుకూలతలు చేసి అప్పగించాం. అయినా కాంగ్రెస్ సర్కారుకు నడిపించే తెలివి లేదు'అని కేసీఆర్ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పాలనలో ఎన్నడూ బిందె పట్టుకుని బయటకు రాని ఆడబిడ్డలు ఇప్పుడు మళ్లీ నీళ్ల కోసం తన్లాడుతుంటే తనకు కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన చెందారు. ఊర్లల్లో మళ్లీ జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు, స్టెబిలైజర్లు వచ్చాయని, మోటర్లు కాలిపోతున్నాయని, పట్టుగొమ్మల్లాంటి పల్లె సీమల్లో బోరు బండ్ల హోరు వినిపిస్తున్నదని, హైదరాబాద్‌లో ట్యాంకర్ల బారులు కనిపిస్తున్నాయని కేసీఆర్ పరితాపం వ్యక్తంచేశారు. పదేండ్లుగా మాయమైనవన్నీ మళ్లీ ప్రత్యక్షమయ్యాయని ఇదీ కాంగ్రెస్ సర్కారు పనితీరు అని ధ్వజమెత్తారు. అద్భుతంగా ఉన్న కరెంటు వంద రోజుల్లోనే, కేసీఆర్ గల్మ దాటంగనే, కట్కు బంజేసినట్టు ఏకదమ్ ఎందుకు బంద్పైందని ఆయన ప్రశ్నించారు. (కేసీఆర్ ఈ ప్రశ్న వేస్తున్న సమయంలోనే అక్కడ కరెంటు కట్ అయింది) ఈ ప్రభుత్వానికి రాజకీయాలు చేసేందుకు తీరిక ఉన్నదిగానీ, ప్రజల సమస్యలు చూసేందుకు వినేందుకు లేదని కేసీఆర్ విమర్శించారు. ''రైతులంటే ఈ ప్రభుత్వానికి పట్టింపే లేదు. పంటలు ఎండుతున్నా ఎమ్మెల్యేలు రారు. ఎంపీలు ఊర్లకు పోరు. మంత్రులకు తీరిక లేదు. ఇక ముఖ్యమంత్రికి ఢిల్లీ యాత్రలే సరిపోతాయి. ఇదీ కాంగ్రెసోళ్ల వ్యవహారం'' అని కేసీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ''వంద రోజుల్లో 200 మంది రైతులు చనిపోతే పాలకులు ఏం చేస్తున్నరు? గుడ్డి గుర్రాల పండ్లు తోముతున్నరా?'' అని ఆయన సూటిగా ప్రశ్నించారు. డిసెంబర్ 9నే రుణమాఫీ చేస్తమని, ఎకరాకు 15 వేల రైతుబంధు వేస్తమని, అన్ని పంటలకు 500 బోనస్ ఇస్తమని గ్యారెంటీలు ప్రకటించిన వాళ్లు ఇప్పుడు ఎక్కడ పోయారని కేసీఆర్ అడిగారు. ''డిసెంబర్ 9 పోయి ఎన్ని రోజులైంది. వేర్ ఆర్ యూ స్లీపింగ్ మిస్టర్ చీఫ్‌మినిస్టర్. ముఖ్యమంత్రీ.. నువ్వెక్కడ నిద్ర పోతున్నవ్?''అని కేసీఆర్ గొంతెత్తారు. ''అవసరమైతే అప్పులు చేయాల్సిందే. రైతులకు కరెంటు ఇవ్వాల్సిందే. రైతులను ఎండబెట్టి విద్యుత్తు ఆదా చేస్తరా? రైతుల కోసం కాకపోతే ఎవరి కోసం అప్పులు చేస్తరు?''అని నిలదీశారు.''మా ప్రభుత్వంలో రైతాంగాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్నం. పదేండ్లలో ఎకరా ఎండని తెలంగాణలో ఇప్పుడు 14 లక్షల ఎకరాలు ఎండబెట్టారు. పంటలు ఎండబెట్టిన వాళ్లు మీరే. ఈ కాంగ్రెసోళ్లే ఎండబెట్టారు. అందువల్ల ఎండిన పంట లెక్కలు తీయాలి. ఎకరాకు 25 వేల పరిహారం ఇవ్వాలి. వెంటనే 2 లక్షల రుణ మాఫీ చేయాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలి. ప్రతి పంటకూ 500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలి. పంటలు ఎండబెట్టి, వాగ్దానాలు ఎగవెట్టి తప్పించుకుంటం అనుకుంటున్నరేమో. పండనియ్యం బిడ్డా. ఇచ్చేదాకా ఊరుకోం. వెంటాడుతం. వేటాడుతం. తరుముతం. రైతన్నలకు అండగా ఉండేది బీఆర్ఎస్సే. వారి కోసం అవసరమైతే రాష్ట్రాన్ని రణరంగంగా మారుస్తం. జాగ్రత్త'' అని కేసీఆర్ తీవ్ర స్వరంతో గర్జించారు. అందరం కలిసి యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు. వాగ్దానాలు అమలు చేయలేకపోతే గద్దె దిగాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేద్దామన్నారు. రైతుల కోసం కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. 2న కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని పార్టీ నాయకులకు సూచించారు. 6న నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు చేయాలని కోరారు. రైతులకు భరోసా కల్పించేందుకు 5న కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో కేసీఆర్ పర్యటించనున్నారు.

కేసీఆర్ బందోబస్తు గాలికి

- పట్టించుకోని జిల్లా పోలీసులు
- జనగామ-సూర్యాపేట హైవేలో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్‌జామ్
- కేసీఆర్‌కు రక్షణగా బీఆర్ఎస్ నేతలు
- ప్రైవేట్ భద్రతతో కేసీఆర్ 'పొలంబాట'

ఎన్నికల కోడ్ నేపథ్యంలో జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండా ఎక్స్‌రోడ్డు చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాన్వాయ్‌ని అధికారులు తనిఖీ చేశారు. మొత్తం మూడు చోట్ల తనిఖీలు చేయగా, వారికి కేసీఆర్ పూర్తి సహకారం అందించారు.

జనగామ, మార్చి 31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బందోబస్తును జనగామ జిల్లా పోలీసు యంత్రాంగం గాలికి వదిలేసింది. ఆదివారం జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఎండిన పంటల పరిశీలన కోసం పొలంబాట పేరిట చేపట్టిన పర్యటనలో కేసీఆర్‌కు తగినంత భద్రత కల్పించడంలో పోలీసుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించింది. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్‌తండాలో ప్రధాన రోడ్డుపై కాన్వాయ్ నిలిచిన తర్వాత ఎండిన పొలాన్ని చూసేందుకు కేసీఆర్ ముందుకు వెళ్లకుండా అడ్డుగా ఉన్న వారిని తప్పించి రూట్‌క్లియర్ చేయాల్సిన స్థానిక పోలీసులు పట్టించుకోలేదు. రోప్ పార్టీ పోలీసులు హైవేకే పరిమితమయ్యారు. కేసీఆర్ పొలం వద్దకు వెళ్లేందుకు రూట్ క్లియర్ చేయాలని పార్టీ ప్రతినిధులు మైక్‌లో పలుమార్లు పోలీసులను అభ్యర్థించినా పట్టించుకోకపోవడంతో కేసీఆర్ బస్సు నుంచి కిందకు దిగేందుకు చాలా సమయం పట్టింది. బందోబస్తుకు పోలీసులు సహకరించడం లేదన్న సంగతి గుర్తించి బస్సులో అధినేత వెంట వచ్చిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహ పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కేసీఆర్ తోపులాటకు గురికాకుండా రక్షణ వలయంగా ఏర్పడి ముందుకు తీసుకెళ్లాల్సి వచ్చింది. చివరకు ప్రైవేట్ రోప్ పార్టీ సెక్యూరిటీ గార్డుల ద్వారా కేసీఆర్ రైతులతో మాట్లాడాల్సి వచ్చింది. కేసీఆర్ కాన్వాయ్ ధరావత్‌తండాలో ఆగిన తర్వాత తిరిగి వెళ్లే వరకు ఇరువైపులా ఆరు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.